ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 5 జనవరి 2024

# సర్కార్ ఉక్కుపాదం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడు వారాలుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులపై ఉక్కుపాదం మోపేందుకు వైసీపీ సర్కార్ సిద్ధమైంది. ఈ రోజు సాయంత్రంలోగా సమ్మె విరమించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీనిపై అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం మాని, వాటిని ప్రశ్నించినందుకు చర్యలకు దిగుతారా ? అంటూ మండిపడుతున్నారు.

- నేటిలోగా అంగన్‌వాడీలు సమ్మె విరమించాలని అల్టిమేటం
- లేదంటే ప్రత్యామ్నాయం చూసుకుంటామంటూ కలెక్టర్ హెచ్చరిక
- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న అంగన్‌వాడీలు
- మరోవైపు సమగ్రశిక్ష ఉద్యోగులకు నేడు నోటీసుల జారీ
- సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేలా 'తీవ్ర చర్యలు' తీసుకుంటామంటూ హెచ్చరికలు


పాలకోడేరులో సీఎం జగన్ మాస్క్ ధరించి బ్యాటింగ్ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

భీమవరం, జనవరి 4 : అంగన్‌వాడీలు ఈ నెల ఐదో తేదీలోగా సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ద్వారా ఆదేశాలు జారీ చేయించింది. గత ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు గత నెల 12 నుంచి సమ్మె చేస్తున్నారు. గురువారానికి అది 24వ రోజుకు చేరింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ పేరుతో ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకుని తెరిపించింది. ఇది మూన్నాళ్ల ముచ్చటగా మారడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ప్రయత్నించి మరోమారు విఫలమైంది. తాజాగా కలెక్టర్ ద్వారా అంగన్‌వాడీలకు అల్టిమేటం జారీచేసియింది. ప్రభుత్వం చాలా చేసిందని, మిగిలినవి చేస్తుందని అంగన్‌వాడీ కేంద్రాలమూతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారమందక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా ఆహారభద్రత చట్టం అమలుకు విఘాతం కలుగుతున్నందున ఈ నెల 5వ తేదీలోగా కచ్చితంగా విధుల్లో చేరాలని, లేదంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని పేర్కొన్నారు. అంటే అంగన్ వాడీలను పక్కనపెట్టి ఇతరులతో ఆయా పనులు చేయించుకుని కేంద్రాలు నిర్వహిస్తామని చెప్పకనే చెప్పినట్టు అయింది. సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులు, దౌర్జన్యాలతో తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం యత్నించడం సరికాదని అంగన్ వాడీలు మండిపడు తున్నారు. జిల్లాలో నూరుశాతం సమ్మెలో ఉన్నారు. అంగన్ వాడీ టీచర్లు 1540, మినీ టీచర్లు 75, సహాయకులు 1,541 మంది సమ్మెలో ఉన్నారు. సమ్మెను కొనసాగిస్తామని సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామోహన్‌రాయ్ తెలిపారు.

## సమ్మె కొనసాగిస్తాం

**కె.ఝాన్సీ, అంగన్‌వాడీ సహాయకుల అసోసియేషన్ అధ్యక్షురాలు**



వివిధ సమస్యలపై 24 రోజులుగా ఆందోళన చేస్తున్నాం. చట్ట ప్రకారం 15 రోజులు ముందు నోటీసులు ఇచ్చాం. కలెక్టరేట్ ఎదుట దఫదఫాలుగా ఆందోళన చేశాం. తరువాతే సమ్మెలోకి దిగాం. మా డిమాండ్‌లను పూర్తిస్థాయిలో ఆమోదించకపోతే సమ్మె విరమించేది లేదు. 5వ తేదీన ఆందోళన చేస్తున్నాం.

## రేపటిలోగా విధుల్లోకి చేరకపోయారో..

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 4 : సమాన పనికి సమాన వేతనం, సర్వీసుల రెగ్యులరైజేషన్, హెచ్‌ఆర్ పాలసీ తదితర డిమాండ్లతో గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల ఆందోళనను అణచివేసే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు ఎస్ఎస్‌ఏ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ/ఎస్ఎస్ఏ తీవ్ర చర్యలకు సిద్ధమైంది. సమ్మెలో పాల్గొన్న వారందరికీ హెచ్చరికలు జారీచేస్తూ శుక్రవారం సాయంత్రం నోటీసులు జారీ చేయనున్నట్టు జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష అధికారులు వెల్లడించారు. ఆ ప్రకారం శనివారం ఉదయంలోగా సమ్మె చేస్తున్న సిబ్బంది విధుల్లో చేరాలని, లేని పక్షంలో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, తదుపరి తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించనున్నారు. ఇటువంటి తీవ్రచర్యల్లో ఉద్యోగ విధుల నుంచి తొలగించి ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించు కుంటామనే హెచ్చరిక ఒకటని అధికార వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో సమగ్ర శిక్ష అభి యాన్‌కు సంబంధించిన 9 విభాగాలలో 409 మంది ఉద్యోగస్తులు సమ్మెలో పాల్గొంటున్నారు. ఎస్ఎస్ఏ ఏలూరు ప్రాజెక్టు పరిధిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు 15 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 28, మండల స్థాయి అక్కౌంటెంట్లు 13, మెసెంజర్లు 25, సీఆర్పీలు 121, ఐఈఆర్టీలు 46, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 161, ఆఫీస్ సబార్డినేట్లు కలిపి మొత్తం 433 మంది పనిచేస్తున్నారు. డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విరమించేది లేదని వారు చెబుతున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్, అకౌంటెంట్, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్స్టెక్టర్లు, సైట్ ఇంజనీర్లు, ఐఈఆర్టీ, ఇలా 9 విభాగాల ఉద్యోగులు ఆందోళనలో పాల్గొంటున్నారు. సిబ్బంది సమ్మె కారణంగా విద్యాశాఖలో కీలకమైన నాడు-నేడు పర్యవేక్షణ పనులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పర్యవేక్షించే పనులు తదితర కార్య కలాపాలు నిలిచి పోయాయి. జిల్లాలో ఈ పనుల్లో కొన్నింటిని వర్కింగ్ టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగించడం ద్వారా ప్రత్యా మ్నాయ మార్గాల్లో నెట్టుకొస్తున్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

## నేడు ఎస్పీడీ కార్యాలయ ముట్టడి

సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రాజెక్టు డైరెక్టర్‌పై తక్ష ణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఏ ఉద్యోగ సిబ్బంది శుక్రవారం ఉదయం 9 గంట లకు విజయవాడ పడమట రైతు బజార్ సమీపంలోని ఎస్ఎస్ఏ ఎస్పీడీ కార్యాలయ ముట్టడికి ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 20 నుంచి సమ్మె చేస్తుండగా వాటిమీద దృష్టి పెట్టకుండా ఉద్యోగులను నిందించేలా ఎస్పీడీ మాట్లాడటం గర్హనీయమని సమగ్రశిక్ష పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసా శ్రీనివాస రావు విమర్శించారు. మహిళా ఉద్యోగులను అవమాన పరుస్తూ వ్యాఖ్యానించిన ఎస్పీడీ ఆ పదవికి అనర్హుడని ఉద్యోగుల సమ్మెకు మద్దతు పలికిన సీపీఐ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.







# మంత్రిగారు వస్తారని..

- అమరావతి ఎక్స్‌ప్రెస్ నరసాపురం వరకు పొడిగింపు !
- మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయం
- ఏడాదిగా దొరకని అపాయింట్‌మెంట్
- ఎన్నికల నాటికైనా గ్రీన్ సిగ్నల్ పడేనా ?

నరసాపురం, జనవరి 4: నరసాపురం- విజయవాడల మధ్య డబ్లింగ్ లైన్ పనులు పూర్తయ్యాయి. అప్పటి వరకు సింగిల్ లైన్ ఉండటం వల్ల కొత్త రైళ్లకు ఆస్కారం లేకుండాపోయింది. గతేడాది పనులు పూర్తయ్యాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న కొత్త రైళ్లు పట్టాలెక్కుతాయని జిల్లా వాసులు ఆశగా ఎదురు చూశారు. దానికి తగ్గట్టుగానే గతేడాది నవంబర్‌లో దక్షిణ మధ్య రైల్వే కర్ణాటక లోని హుబ్లీ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ నుంచి నరసాపురం వరకు పొడిగించింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు ఈ ఏడాది జనవరిలో పట్టాలెక్కాల్సి ఉంది. దీనికి సంబంధించి అన్ని క్లియరెన్స్‌లను రైల్వేశాఖ మంజూరు చేసింది. దీంతో జిల్లా నుంచి గుంతకల్, బళ్లారి, రాయచూర్, హుబ్లీతో పాటు గోవా వెళ్లే ప్రయాణికులు కూడా ఈ కొత్త రైలు కోసం ఎదురుచూశారు. ఈరైలు ప్రారంభానికి ఒక కేంద్ర మంత్రి అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆయనచేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. అయితే అప్పట్లో ఆయన షెడ్యూల్ రద్దయ్యాయి. దీంతో మార్చిలోనైనా ప్రారంభించాలని ప్రయత్నించారు. అది కుదర లేదు. అ తరువాత తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఆ మంత్రిగారు బిజీ అయిపోయారు. అప్పటి నుంచి ఈ రైలు ప్రారంభానికి ముహూర్తం కుదరలేదు. దీంతో ఈ ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచే నడుస్తున్నది. ఈ ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరో ఎనిమిది కొత్త రైళ్ళకు అప్పట్లో దక్షిణ మధ్య రైల్వే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటిలో మచిలీపట్నం -ధర్మవరం కూడా ఉంది. ఇవన్నీ పట్టాలె క్కాయి. కానీ నరసాపురం నుంచి ప్రారంభం కావాల్సిన అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు మాత్రం గ్రీన్‌సిగ్నల్ పడలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో ఈ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాలని మరోసారి ప్రయత్నించారు. అది కూడా చివరి నిముషంలో రద్దయింది. దీంతో ఎలాగైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చేనాటికైనా ఆ మంత్రిగారిని తీసుకొచ్చి ఈ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాలని రైల్వే అధికారులతో పాటు ఆ పార్టీ నాయకులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

## జిల్లాలో కర్ణాటక వాసులెక్కువే

ఉమ్మడి పశ్చిమలో కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి, గంగావతి, హుబ్లీ తదితర ప్రాంతాల్లో అనేక మంది స్థిరపడ్డారు. దాదాపు 50 ఏళ్ల క్రితం వీరంతా వ్యవసాయ నిమిత్తం అక్కడికి వలస వెళ్లారు. అక్కడ నుంచి రావాలంటే బస్సు లేదా విజయవాడ వరకు రైలును ఆశ్రయిస్తున్నారు. చాలా ఏళ్లుగా అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే, రాజకీయ నేతలకు ఆనేక విజ్ఞప్తులు కూడా చేశారు. చివరికి డబ్లింగ్ పని పూర్తికావడంతో తమ కల నేరవేరిందనుకున్నారు. రైలుకు అనుమతి వచ్చినా గ్రీన్‌సిగ్నల్ మాత్రం పడలేదని పెదవి విరుస్తున్నారు.



# నీతికి-అవినీతికి యుద్ధం

7

చంద్రబాబు సభ విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి. పక్కన ఎస్పీ రవిప్రకాశ్, జేసీ రామ్ సుందర్‌రెడ్డి

## సమస్యాత్మక కేంద్రాలు, ప్రాంతాలపై అవగాహన అవసరం : కలెక్టర్

భీమవరం, జనవరి 4 : ఎన్నికల సమయంలో జిల్లాలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగు కేంద్రాలు, ప్రాంతాలపై పూర్తి అవగాహన,అప్రమత్తత అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం పోలీస్ అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులతో కలెక్టర్, ఎస్పీ రవిప్రకాశ్ సమావేశం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు వీలుగా రెవెన్యూ, పోలీస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికలు నిర్వహణలో ఏర్పడిన అడ్డంకులను పరిగణ లోకి తీసుకోవాలన్నారు. మద్యం, డబ్బు పంపిణీ ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ముందస్తు చర్యలను అధికారులు చేపట్టాలన్నారు. మతపరమైన, సామాజిక పరమైన గొడవలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ఇప్పటినుంచే గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, అదనపు ఎస్పీ భీమారావు, సెబ్ ఏఎస్పీ రవికుమార్, డీఆర్‌వో బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, చెన్నయ్య, అచ్యుత అంబరీష్, జిల్లా ఎక్సైజ్ అధికారి రంగారెడ్డి, డీఎస్పీలు శ్రీనాథ్, సి.శరత్ రాజ్‌కుమార్, కె.రవిమనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

## జయహో బీసీ సదస్సు




మంగళగిరి తెలుగుదేశం కార్యాలయంలో గురువారం జరిగిన జయహో బీసీ వర్క్‌షాపులో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, పాల్గొన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పితాని సత్యనారాయణ, గొర్రెల శ్రీధర్ తదితరులు, చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

# నీతికి-అవినీతికి యుద్ధం

**ఇలాంటి శాడిస్టు సీఎంను ఎప్పుడూ చూడలేదు : రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల**

ఆచంట/పాలకొల్లు టౌన్/భీమవరం టౌన్: జనవరి 4 : రాబోయే ఎన్నికలు నీతికి, అవినీతికి మధ్య యుద్ధం వంటిదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే, ఆచంట సభ టూర్ కో-ఆర్డినేటర్ గోరంట్ల బుచ్చియ్యచౌదరి స్పష్టం చేశారు. ఈ నెల ఏడో తేదీన ఆచంటలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు భారీ బహిరంగ సభ పర్యవేక్షణ నిమిత్తం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రజాస్వామ్యంలో అందరికి హక్కులు ఉంటాయి. ఈ ప్రభుత్వంలో మీడియాపై నియంత్రణ, రాజకీయ పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. జగన్ దోచుకున్న లక్షల కోట్ల తో మీడియా నడుపుతున్నారు. తన 55 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి శాడిస్ట్ సీఎంను ఎప్పుడూ చూడలేదు' అని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల టీడీపీ అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ జగన్ పాలనలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ఆచంట సభలో చంద్రబాబు రైతులకు దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. రెండు జిల్లా కో-ఆర్డినేటర్లు మందలపర్రు రవి, గొడవర్తి శ్రీరాములు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య పాల్గొన్నారు.

### చంద్రబాబు సభకు తరలిరండి




ఆచంటలో టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేద్దామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ పిలుపునిచ్చారు. పాలకొల్లులోని ఎమ్మెల్యే రామానాయుడు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ స్థాయిలో జరిగే 'రా కదలిరా టీడీపీ ఎన్నికల శంఖారావ మహాసభకు పాలకొల్లు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్య లో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్తారన్నారు. మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే ఎమ్మెల్యే నిమ్మలను గత మెజార్టీకన్నా రెండింతల ఎక్కువతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

### జగన్ ప్రభుత్వం అన్నింటా విఫలం

'సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నిరంగాల్లో పూర్తిగా విఫలమైంది. స్థానిక అధికారులను బదిలీ చేసినట్టు వైసీపీ ఎమ్మెల్యేలను, ఇన్‌చార్జిలను బదిలీ చేసే పరిస్థితికి దిగజారింది. సీఎం తన కుటుంబంలో చిచ్చు పెట్టుకున్నాడు.




ఆచంటలో మాట్లాడుతున్న రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చియ్యచౌదరి, భీమవరంలో మాట్లాడుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తోట సీతారామలక్ష్మి

జగనన్న బాణం షర్మిల తిరిగి ఆయనపైనే ఎక్కు పెట్టింది. మరో మూడు నెలల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం.' అని అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం భీమవరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి కలిసి మాట్లాడారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ రానున్న ఎన్నికల ప్రజాక్షేత్రంలో జగన్ ఓడిపోతామని తెలిసి వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల్లో అసమ్మతి వ్యతిరేకత ఉందనే సాకుతో అభ్యర్థులను, ఇన్‌చార్జిలను మారుస్తున్నారని ఎంతమంది అభ్యర్థులను మార్చిన జనం జగన్‌ని మార్చడం ఖాయమన్నారు. చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్‌తో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్‌పై త్వరలోనే వైసీపీ ఎమ్మెల్యేలు ఎంపీలు తిరుగుబాటు చేసి పార్టీని విడవనున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాలు, పట్టణం నుంచి చంద్రబాబు మహాసభకు అత్యధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహాసభ భీమవరం, వీరవాసరం మండల పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, శీలం వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, భీమవరం పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

### సభాస్థలంలో నరసాపురం డీఎస్పీ పరిశీలన

ఆచంటలో నిర్వహించే చంద్రబాబు బహిరంగ సభ నిమిత్తం సభా స్థలం ఏర్పాట్లపై గురువారం నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరచారి టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు ఎలా చేస్తున్నారనే దానిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గన్ని వీరాంజనేయులు, తోట సీతారామలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. వీరు హెలిప్యాడ్ ప్రాంతాన్ని, ప్యారింగ్ ప్రాంతాన్ని సభా స్థలాన్ని చూపించి ఏర్పాట్లపై వివరించారు. కార్యక్రమంలో పెనుగొండ సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఉన్నారు.



నాయకులతో కలిసి సభాస్థలాన్ని పరిశీలిస్తున్న నరసాపురం డీఎస్పీ

### వైసీపీలో చేరింది జన సైనికులు కాదు'



భీమవరం టౌన్ : 'ఇటీవల భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన నుంచి వైసీపీలో చేరిన వారు స్థానిక జనసైనికులు కాదు.. ఇతర జిల్లాల వారని, దీనిపై బహిరంగ చర్చకు వస్తే సిద్ధమని జనసేన జిల్లా కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ సవాల్ విసిరారు. భీమవరంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. భీమవరం నుంచి పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని బలంగా నమ్ముతామని, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలియడం లేదన్నారు. బండి రమేష్‌కుమార్, మోకా శ్రీను, మాగపు ప్రసాద్, ఎల్.నాగు పాల్గొన్నారు

### కరాటం జానకీరామ్‌కు టీడీపీ తీర్థం

బుట్టాయగూడెం : వైసీపీ నాయకుడు కరాటం జానకీరామ్ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జానకీరామ్ సతీమణి సీతాదేవి పోలవరం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు కృష్ణస్వరూప్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు. నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సూచనల మేరకు టీడీపీలో చేరారు. నాయకులు యంత్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే గుర్తింపు తథ్యం



మాట్లాడుతున్న ఏపీ నిట్ ఆచార్యుడు సందీప్

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 4 : కష్టపడి చదివిన విద్యార్థులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వుద్దంటి సందీప్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి సూచనల మేరకు ఏలూరు ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌ను సందర్శించారు. ప్రాంగణంలోని ప్రయోగశాలలు, లైబ్రరీ, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలోనే విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో నవకల్పనకు బాటలు వేయాలన్నారు. కృత్రిమ మేదస్సు, రోబోటిక్స్ తదితర నూతన సాంకేతికతపై లోతైన అవగాహనను పెంచుకుని పట్టు సాధిస్తారో వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నిట్ ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, ఎస్ఆర్ఐ కళాశాల అధ్యాపకులు మురళీకృష్ణ, శైలు, మానస, రామాంజనేయులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ లక్కీడిప్.. విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 4: ఆర్టీసీ స్పెషల్ రూట్లలో లక్కీడిప్ ఏర్పాటు చేసి వారికి బహుమతులు అందించడం ద్వారా ప్రయాణికులను ప్రోత్సహించడం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ అచంట, జంగారెడ్డిగూడెం, గణపవరం- భీమవరం రూట్లలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి గురువారం లక్కీడిప్ నిర్వహించారు. ఈ లక్కీడిప్‌లో జంగారెడ్డిగూడెం రూట్‌లో భువనేశ్వరి, బి.పవిత్ర, అచంట రూట్‌లో ఎ.సునీత, టి.సామ్రాజ్య, గణపవరం-భీమవరం రూట్‌లో కుసుమకుమారి, ఎస్.మణిమాలకు బహుమతులు లభించాయి.

### 9నుంచి సీపీఎం రాష్ట్ర సమావేశాలు




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరుటూటౌన్, జనవరి 4: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏలూరులో ఈనెల 9, 10, 11వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమావేశాల్లో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించడం వామపక్షాల ఐక్యతపై రాష్ట్ర సదస్సులో చర్చిస్తామన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారన్నారు. అంగన్వాడీ, మున్సిపల్ కార్మికు లు, ఇతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జగన్ విఫలమయ్యాడన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దాసోహమై రాష్ట్రానికి అన్యాయం చేస్తుందన్నారు. నూతన భూచట్టాన్ని తెచ్చి రైతులు, పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని, దాన్ని బలప రిచే వైసీపీలను చిత్తుగా ఓడించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 9వ తేదీన ఆర్ఆర్.పేట కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

## న్యాయం చేయాలి

**» టి.నరసాపురం సొసైటీ డిపాజిట్‌దారుల ఆందోళన**



సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న డిపాజిట్ దారులు

టి.నరసాపురం, జనవరి 4 : రుణాలు తీసుకుని తిరిగి కట్టని వారిపై తక్షణ చర్యలు తీసుకుని డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని టి.నరసాపురం సొసైటీ డిపాజిట్‌దారులు డిమాండ్ చేశారు. గురువారం సొసైటీ ఎదుట ఆందోళన చేపట్టారు. కొన్ని గంటలపాటు సొసైటీ ఆఫీసు తెరవకుండా పెట్రోల్ బంకు సాగకుండా నిలిపివేశారు. గ్రామానికి చెందిన అనుమోలు సీతారత్నంకు కోటి యాభై లక్షలు రావాలని, కన్నం శ్రీనుకు రూ.8 లక్షలు, పలివెల రాంబాబు రూ.6 లక్షలు, నాయుడు వెంకటేశ్వరరావుకు రూ.15 లక్షలు, మన్యం వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు, ఎస్‌కే ఈషా వలికి 2.50 లక్షలు, చిట్టిబొమ్మ శ్రీనుకు రూ.4.50 లక్షలు గడువు ముగిసిన ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టి బొమ్మశ్రీను మాట్లాడుతూ తన తల్లి హాస్పిటల్లో ఉందని వైద్యం చేయడానికి కూడా డబ్బులు లేవని వాపోయారు. పలివెల రాంబాబు మాట్లాడుతూ డిపాజిట్ చేసిన డబ్బులు రాకపోవడంతో తన కుమార్తె పెళ్లి కూడా ఆగిపోయిందన్నారు. ఈ విషయంలో సొసైటీ సిబ్బంది గానీ అధికారులు గానీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆందోళన విషయమై సొసైటీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి డిపాజిట్‌దారులను సముదాయించారు. అధికారులు మాత్రం దీనిపై స్పష్టమైన హామీ రైతులకు ఇవ్వలేదు. పదిమంది డిపాజిట్‌దారులు మాత్రమే బయటికి వచ్చారని కానీ వందలాదిమంది డిపాజిట్‌దారులు బయటకు రాలేక ఆవేదన చెందుతున్నారని వాపోయారు. ఈ విషయంపై కార్యదర్శి కటకం రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్టోబర్ నెలాఖరు నుంచి త్రీమెన్ కమిటీ సొసైటీకి రావడం లేదని, డిపాజిట్‌దారుల ఆందోళన విషయాన్ని ఉన్నతాధికారులకి తెలిపామని, ఏ నిర్ణయమైనా త్రీమెన్ కమిటీ తీసుకోవలసి ఉంటుందన్నారు.

### కుంతీదేవి ఉత్సవాల్లో దర్శకుడు వీవీ వినాయక్



కుంతీదేవి ఉత్సవాల్లో పాల్గొన్న వీవీ వినాయక్

పోలవరం, జనవరి 4 : గూటాల పంచాయతీ మహాలక్ష్మిదేవిపేటలో ప్రారంభమైన కుంతీదేవి ఉత్సవాల్లో దర్శకుడు వీవీ వినాయక్, ఎంపీ కోటగిరి శ్రీధర్ సోదరి పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారిద్దరూ కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. వీవీ వినాయక్ మాట్లాడుతూ తనమీద ప్రాంతీయ అభిమానంతో ఆహ్వానించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఉపసర్పంచ్ కోరశిక శ్రీనివాస్, దేవిశెట్టి రమేశ్, అక్కాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో చాట్రాయి తహసీల్దార్ మృతి



విశ్వనాథరావు (ఫైల్)

చాట్రాయి, జనవరి 4: చాట్రాయి మండల తహసీల్దార్ సీహెచ్ విశ్వనాథరావు (57) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ చాట్రాయి మండలంలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయమే నిద్ర లేచిన తరువాత గుండెలో నొప్పిగా ఉందని ఇంటి పనులు చూసే వ్యక్తితో చెప్పారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని సీపీఆర్ చేస్తూ విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య ఎన్టీఆర్ జిల్లాలో ట్రెజరీ శాఖలో జిల్లా అధికారిగా పనిచేస్తూ విజయవాడలో నివాసం ఉంటున్నారు. ఒక కుమార్తె విజయవాడలో వైద్యురాలిగా పని చేస్తుండగా మరో కుమార్తె అమెరికాలో చదువుకుంటోంది. ఆయన భౌతికాయాన్ని స్వగ్రా మమైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడు తరలించారు. అమెరికా నుంచి కుమార్తె వచ్చాక అంత్యక్రియలు జరుగుతాయని సన్నిహితులు తెలిపారు.

### ఏలూరు జిల్లాలో ఎస్ఈబీ దాడులు

ఏలూరు క్రైం, జనవరి 4 : జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ తన సిబ్బందితో లింగపాలెం మండలం ముడిచర్లలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా, 1200 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకుని చింతలపూడి పోలీసులకు తదుపరి చర్యలు నిమిత్తం అప్పగించారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది కలిసి చాట్రాయి మండలం ముంకొల్లు గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,770 నగదు, ఐదు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకుని చాట్రాయి పోలీసులకు అప్పగించినట్టు ఎస్ఈబీ సీఐ తెలిపారు.



వీణ కచేరి చేస్తున్న యోగానందం, బృందం సభ్యులు

### ఓలలాడించిన 'యోగానందం' వీణ కచేరి

భీమవరంటౌన్, జనవరి 4 : భీమవరం త్యాగరాజ భవనంలో జరుగుతున్న త్యాగరాజ 105వ ఆరాధనోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం త్యాగరాజ భవనంలో బెంగళూరుకు చెందిన వీణ విద్వాంసురాలు జె.యోగానందంచే వీణ కచేరి సంగీత ప్రియులను ఓలలాడించారు. తొలుత పంచరత్న కీర్తన జగదానందకారక కీర్తనతో వీణ కచేరి ప్రారంభించారు. సరస్వతి నమోస్తుతే కీర్తన సరస్వతీరాగం రూపతాళం, రఘు నాధనస్సు-సుర రంజనిరాగం ఆదితాళం, వాణీ ద్వారా పలికించి ఆనందింపజేశారు. ప్రధాన కీర్తనగా నను పాలింపగా నడిచివచ్చితివా మోహనరాగంలతో శ్రోతలను ఆకట్టుకున్నాయి. వీణ కచేరికి సహవాయిద్యులుగా బెంగళూరుకు చెందిన రక్షిత రమేష్ మృదంగం లక్ష్మీరాజశేఖర్, కంజర భాగ్యలక్ష్మణకృష్ణ సహకరించారు. అనంతరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కార్యదర్శి కారుమూరి ఆదిత్య, కారుమూరి చినబాబు, చెరుకువాడ వెంకట్రామయ్య రంగసాయి కళాకారులను సత్కరించారు.

### తెలుగు మహాసభలకు శ్రీవారి ప్రచారరథం



ద్వారకాతిరుమల, జనవరి 5 : రాజమహేంద్రవరంలో జరిగే తెలుగు మహాసభలకు శ్రీవారి ధర్మప్రచార రథం గురువారం తెల్లవారుజామున తరలివెళ్లింది. అక్కడ గైట్ కళాశాలలో జరుగనున్న సభల నిమిత్తం ఈనెల 8 వరకు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈక్రమంలో ప్రచార రథ్నాన పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. ఆ తరువాత రథానికి అర్చకులు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి ప్రారం భించారు. ప్రచారరథాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాగనంపారు.

### ఆరుగురి జూదరుల అరెస్ట్

ఉండి, జనవరి 4 : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశామని ఉండి పోలీసులు తెలిపారు. గురువారం ఉండి ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ మాట్లాడుతూ వాంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రు.4140 నగదు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

### ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే బాధ్యత పోలీసులదే : ఎస్పీ ప్రశాంతి



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 4 : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూసే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలీసు అధికారులతో గురువారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టారు పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులను నిర్వహిస్తూ సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. పోలీసు అధికారులకు కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆ ప్రదేశాల్లోని భౌగోళిక స్వరూపాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. సెక్టార్ పోలీసు అధికారులు తమకు నిర్ణయించిన పోలింగ్ బూత్‌లను పరిశీలన చేసి అక్కడ పోలింగ్ సక్రమంగా నిర్వహించడానికి కావాల్సిన వసతులు ఉన్నాయో లేదో గమనించి ఏమైనా లోపాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఏమైనా కేసులు నమోదైనా, అవినీతి కేసుల్లో ఉన్న ముద్దాయిలు, రౌడీషీటర్ల జీవన విధానాన్ని పరిశీలించి వారి నడవడికపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా తగిన సహాయ సహకారాలు, రక్షణ కల్పించాలని సూచించారు. వీసీలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ బోణం ఆదిప్రసాద్ పాల్గొన్నారు.


## క్రైం కార్నర్

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ళ, జనవరి 4 : ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వచ్చిన ఫిర్యాదుపై కాళ్ల పోలీస్‌స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరం పట్టణానికి చెందిన కె.శ్రీను(44) భీమవరంలోని చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉంటుంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్తిగా మద్యానికి బానిసైన అతడు డిసెంబరు 30న కాళ్ళ మండలం కాళ్ళ గ్రామంలోని తన తల్లి రమణమ్మ ఇంటి వద్దకు వచ్చి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన తల్లి బంధువులతో కలిసి భీమవరం ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరులో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై మృతుడి పెద్ద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాళ్ళ ఏఎస్ఐ వీవీఎస్ రామరాజు తెలిపారు.

### రేషన్, ఎండీయూ వాహనాల్లో విజిలెన్స్ తనిఖీలు

**» 4 రేషన్ షాపులు, 2 రేషన్ ఎండీయూ వాహనదారులపై కేసులు**



రేషన్ వాహనంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పాలకొల్లు టౌన్, జనవరి 4 :జిల్లా విజిలెన్స్ ఎస్పీ కరణం కుమారి ఆదేశాల మేరకు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పాలకొల్లు పట్టణంలో రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను గురువారం తనిఖీ లు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 47, 42, 56, 58 నంబర్ల రేషన్ దుకాణా ల్లోనూ. రెండు ఎండీయూ వాహనాల్లోనూ తనిఖీలు నిర్వహించి సరుకులు వ్యత్యాసాన్ని గుర్తించారు. నలుగురు రేషన్ డీలర్లపైనా ఇద్దరు ఎండీయూ రేషన్ వాహనదారులపైనా కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్.రంజిత్‌కుమార్ విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏవో బి.సురేష్, సివిల్ సప్లయ్ తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.





పోలవరంలో కోతి కుక్క ఆలింగనం

### శునకం-వానర స్నేహ బంధం

కుల, మత, జాతి, వర్గ వైషమ్యాలతో మానవులు నిత్యం సతమతమవుతున్న నేపథ్యంలో స్నేహమేరా జీవితం అంటూ గురువారం ఒక వానరం, శునకం స్నేహభావంతో ఆలింగనం చేసుకుని ఆడుకుంటున్న ఘటన కనిపించింది. పోలవరం పంచాయతీ బెస్తావీధిలో ఒక వీధి కుక్క.. చెట్లపై తిరుగుతూ వచ్చిన ఒక వానరం ఒక్కసారి స్నేహం చేసి చూడు ఎంత బావుంటుందో అన్నట్టు కనిపించాయి. - పోలవరం

### నేల కూలిన వందేళ్ల మర్రిచెట్టు

పోలవరం గ్రామ శివారున తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టు గురువారం అగ్నికి ఆహుతై రోడ్డుపై కూలింది. ఆ సమయంలో రోడ్డుపై జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. నిత్యం ఆ రోడ్డుపై పునరావాస గ్రామాలకు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజానీకం రాకపోకలు సాగిస్తుంటారు. వందేళ్ల చరిత్ర గల ఊడల మర్రిచెట్టుకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మొదలు కాలి రోడ్డుపై కూలిపోయింది.



పోలవరంలో రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

## దాళ్వా సాగు వేగవంతం చేయాలి

నరసాపురం రూరల్, జనవరి 4: మండలంలో సార్వా పంట కోతలు పూర్తవ్వగానే దాళ్వా సాగుకు ఉపక్రమించాలని ఏవో డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో కోతలు చివరి దశకు చేరాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నందున రైతులు నాట్లు వేయాలన్నారు. లేని పక్షంలో పంట చివరి సమయంలో సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందన్నారు

## అంగన్‌వాడీ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, జనవరి 4: అంగన్వాడీ, మునిసిపల్ ఉద్యోగులు, వీవోఏలు, ఆశా వర్కర్లు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిషార కోసం రోడ్డున పడారని, ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి డిమాండ్‌ను పరిష్కరించాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ముఖ్యనాయకుల సమావేశం గురువారం భీమవరంలోని మెంటేవారితోట జిల్లా కార్యాలయంలో జరిగింది. జగన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు లేవన్నారు. మంచీనీరు, రోడ్లు, డ్రెయినేజీ, స్కూళ్ళు ఏర్పాటు చేయాలన్నారు.

## వృద్ధులకు బియ్యం పంపిణీ

భీమవరం అర్బన్, జనవరి 4: మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ ములుగుర్తి వెంకటరామయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ములుగుర్తి సుధీర్ ఆధ్వర్యంలో 100మంది పేద వృద్ధులు, వికలాంగులకు ఐదు కేజీలు చొప్పున బియ్యంను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రేవూరి గోగురాజు, తిరుమాని రాము, నేరేడు మిల్లి మహేష్, ములుగుర్తి చంటి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శానిటైజర్స్, మాస్కల పంపిణీ

కాళ్ళ, జనవరి 4 : పెదఅమిరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏయూ కోఆర్డినేటర్ బి.పావని మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల దత్తత గ్రామాల్లో సేవలందిస్తే నరేంద్రమోదీ ఆశయాలు ప్రతీ పల్లెకు తీసుకెళ్లిన ఘనత నిలుస్తుందన్నారు. అనంతరం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత కోసం శానిటైజర్స్, మాస్కులు అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## బీసీ గర్జనకు తరలిన నాయకులు


టీడీపీ బీసీ సదస్సుకు తరలిన పాలకోడేరు నాయకులు

పాలకోడేరు, జనవరి 4 : బీసీలకు గుర్తింపుతో పాటు గౌరవాన్ని ఇచ్చిన పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన బీసీ సదస్సునకు పాలకోడేరు నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా కామన రాంబాబు మాట్లాడుతూ బీసీలంతా టీడీపీతోనే ఉన్నారని పార్టీ నిర్వహించిన బీసీ గర్జనతో మరోసారి రుజువైందన్నారు. దొంగ కృష్ణ, బీసీ పాలకోడేరు యువ నాయకుడు వెంకటేష్, అశోక్, వీరవల్లి వెంకటలక్ష్మి, భారతి, శ్రీదేవి పాల్గొన్నారు.

## కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు


గరగపర్రులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు, జనవరి 4 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందేలు, జూదాలు నిర్వహించిన వారిపైన, కోడిపందేలకు స్థలాలు ఇచ్చేవారిపైన, కత్తులు కట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. గరగపర్రు, గొల్లలకోడేరు గ్రామాలలో కోడిపందేల నివారణపై గురువారం అవగాహన కల్పించారు.

## పింఛన్లు పంపిణీ


భీమవరంలో పింఛన్ నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి

భీమవరం రూరల్, జనవరి 4 : లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు దరఖాస్తులు చేసుకున్న వెంటనే పరిశీలన అనంతరం కొత్తగా పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. త్యాగరాజ భవనంలో గురువారం తాజాగా 418 మంది కొత్తవారికి మంజూరైన పింఛన్లను అందంచారు. కార్యక్రమంలో మేడిది జాన్సన్, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, కామన నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తోట బోగయ్య కోడె యుగందర్ పాల్గొన్నారు.

**ఆచంట:** శ్రీ రామేశ్వరస్వామి సత్రంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజిని, ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీడీవో నరసింహ వర ప్రసాద్ పాల్గొన్నారు.

**మొగల్తూరు:** నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్‌లను గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు లబ్ధిదారులకు అందించారు. మొగల్తూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పింఛన్ కానుక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

## పింఛన్‌లు అందక ఇబ్బందులు

ప్రతీ నెల 1వ తేదీన అందించే సామాజిక పింఛన్‌లు ఈనెల 4వ తేదీ ఇస్తారని ప్రకటించినా లబ్ధిదారులకు అందలేదు. మొగల్తూరు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పింఛన్ ఇస్తారని వలంటీర్లు ద్వారా తెలియడంతో వృద్ధులు పింఛన్ కోసం ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఇదే క్రమంలో పింఛన్ వస్తుందని ఆశతో వచ్చిన ఒక వృద్ధుడు పాఠశాల ద్వారం గేటు వద్ద ప్రమాదవశాత్తూ పడిపోవటంతో అక్కడ ఉన్న పోలీసులు, సచివాలయ సిబ్బంది ఆ వృద్ధుడుని లేపి సపరియలు చేశారు. తీరా నూతన లబ్ధిదారులకు మాత్రమే పింఛన్‌లు ఇవ్వడంతో పాత లబ్ధిదారులైన వృద్ధులు, వితంతువులు నిరాశగా వెనుతిరిగారు.

## షర్మిల రాకతో కాంగ్రెస్‌కు మంచి రోజులు

గణపవరం, జనవరి 4 : వైఎస్. షర్మిల కాంగ్రెస్‌పార్టీలో చేరడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచిరోజులు వస్తాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. గురువారం పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో వైసీపీని చూసి ప్రజలు విసిగిపోయారన్నారు. రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## భూసారం పెంపొందిస్తే అధిక దిగుబడులు


రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన

యలమంచిలి, జనవరి 4: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భూసారం పెంపొ ందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవ చ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌చార్జి పి.అప్పారావు అన్నారు. కాంబోట్లపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో వరిసాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. భూసారం పెంపుకు అవలంభించాల్సిన పద్ధతులు, విత్తనశుద్ధికి వాడే భీజామృతం తయారీ, నారుమడులు చీడపీడల బారిన పడకుండా వాడే ద్రావణాల తయరీ విధానాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.మురళికృష్ణ, జడ్డు బదరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రచయిత నాగేశ్వరరావుకు అవార్డు



పెనుగొండ, జనవరి 4: పెనుగొండకు చెందిన కవి, రచయిత ఎస్‌కె నాగేశ్వరరావుకు స్వాతంత్ర్య సమరయోధులు పడాల రామారావు శత జయంతి సందర్భంగా వారి పేరిట నెలకొల్పిన అవార్డు ప్రకటించారు. ఈ నెల 6న రాజమండ్రిలో వీరేశలింగం కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమి, అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే సభలో ఇస్తారు. అరసం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, కన్వీనర్ పడాల వీరబద్రరావు ఈ విషయం తెలిపారు.

## అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, జనవరి 4 : తన భర్త చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భీమవరం మోగంటివారి వీధిలో నివాసం ఉంటున్న ముత్తరెడ్డి గౌరీశాంతి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. గౌరీశాంతికి భీమవరానికి చెందిన శివకోటేశ్వరరావుతో 2009లో ప్రేమ వివాహం అయ్యింది. వివాహ సమయంలో రూ.50వేలు నగదు ఇచ్చారు. ఇప్పుడు అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని గౌరీశాంతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హనుమంతరావు కేసు నమోదు చేశారు.


భీమవరం, ఆకివీడులలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు... వీరవాసరంలో శిబిరంలో భోజనం చేస్తున్న అంగన్‌వాడీలు

# 24వ రోజుకు అంగన్‌వాడీల నిరసన

ఆకివీడు/తణుకు/భీమవరం అర్బన్/ వీరవాసరం/గణపవరం/ఆచంట/పెంటపాడు, జనవరి 4: ఆకివీడు గాంధీజీ సెంటర్‌లో అంగన్‌వాడీలు 24వ రోజు సమ్మె కొనసాగింది. శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా సహాయ కార్యదర్శి హసీనా, సీఐటీయూ మండల నాయకులు కె.తవిటినాయుడు పాల్గొన్నారు. తణుకులో పోటీ కార్మికులతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తే ఊరుకోమని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ లక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా శిబిరం వద్ద గురువారం మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. భీమవరంలో అంగన్వాడీ కార్మికులు 24వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గణపవరంలో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. వీరవాసరం, ఆచంట, పెంటపాడులలో 24వ రోజు దీక్షలు కొనసాగాయి.


తణుకులో మోకాళ్ళపై నిల్చొని నిరసన

### మాతో పెట్టుకొంటే.. జగన్ అవుట్

పాలకోడేరు, జనవరి 4 : పాలకోడేరులోని ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా క్రికెట్ ఆడుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. జగన్ పేరును ముఖానికి మాస్క్ పెట్టుకొని ఓ కార్యకర్త క్రికెట్ ఆడుతుండగా.. అంగన్‌వాడీ పేరుతో మరో కార్యకర్త బౌలింగ్ చేసి జగన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసింది. రానున్న ఎన్నికలలో తమకు న్యాయం చేయక పోతే జగన్‌కు ఇదే పరిస్థితి ఉంటుందంటూ నిరసన తెలిపారు.

## 'అప్పుల రాష్ట్రంగా మార్చిన వైసీపీ'


కాళ్ళలో పర్యటిస్తున్న జనసేన ఇన్‌చార్జి నాగరాజు

కాళ్ళ, జనవరి 4 : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 'అప్పుల ఆంధ్రప్రదేశ్'గా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే చెందుతుందని జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. కాళ్ళలో 'జనంలోకి జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు, మేకా కాశీచరణ్, బండారు సోమేశ్వరరావు, పిల్లా బాబులు, ఆరేటి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

**వీరవాసరం:** రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన కలయిక అని జనసేన మండలశాఖ అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, మత్స్యపురి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా కనకయ్య పేర్కొన్నారు. గురువారం మత్స్యపురి గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టో వివరాలను ఇంటింటికీ తెలియజేస్తూ కరపత్రాలు అందచేశారు. సర్పంచ్ కారేపల్లి శాంతిప్రియ, ఉప సర్పంచ్ జవ్వాది భాస్కర్రావు, గండి యోహాన్‌రాజు, మురాల ఏసురత్నం, పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, జనవరి 4: మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఆకుతీగపాడు, ముదునూరు, రావికుంట, ముక్తేపురం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

## రేపు దేవస్థానం భూమి సేద్యానికి వేలం

వీరవాసరం, జనవరి 4: వీరవాసరం గ్రూపు దేవస్థానం ఆధీనంలో ఉన్న 3.83 ఎకరాల భూమి సేద్యపు హక్కును బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో కొండవేటి రామచంద్రరావు తెలిపారు. వీరేశ్వర, విశ్వేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వేణుగోపాలసీతారామస్వామి, కనకదుర్గమ్మ దేవస్థానానికి చెందిన ఈ భూమి హక్కులు 2023-24 సంవత్సరానికి సంబందించి రెండవ పంట అయిన దాళ్వా సాగునకు మాత్రమే వేలం వేస్తున్నామన్నారు. శనివారం అధికారుల సమక్షంలో దేవస్థానం ప్రాంగణంలో బహిరంగు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

## పుల్లాయిగూడెంలో అగ్నిప్రమాదం


ఆర్థిక సాయం అందిస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 4: మండలంలోని పుల్లాయిగూడెంలో పెదముర్తి ముసలమ్మ తాటాకిల్లు గురువారం తెల్లవారు జామున దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. రూ. రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు చెబుతున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి నిత్యావసర సరుకులు, బియ్యం, సామగ్రితోపాటు, ఆర్థిక సాయం అందించారు. పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు, ఆలపాటి రాంబాబు ఉన్నారు. బాధితులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పరామర్శించి నూతన వస్త్రాలు, నగదు అందజేశారు. ఆడపా ప్రసాద్, అడ్డగర్ల సూరి, ఆకుల శ్రీను, బద్దిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిక



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 4: కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మాలకొండయ్య అన్నారు. తాడేపల్లిగూడెం వర్తక సంఘ భవనంలో గురువారం జిల్లా శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, పోలింగ్‌బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. అనంతరం విశాఖపట్నంలో నిర్వహించే బీసీ సామాజిక చైతన్య సభ కరపత్రాలను ఆవిష్కరించారు.

## వెటర్నరీ అసిస్టెంట్‌లు సక్రమంగా పనిచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 4: వెటర్నరి అసిస్టెంట్‌ల పనితీరుపై వస్తున్న విమర్శలపై డిప్యూటీ డైరెక్టర్ ఎల్.కె. సుధాకర్ సీరియస్ అయ్యారు. సక్రమంగా పనిచేయకుంటే చర్యలు తప్పవన్నారు. ఆరుగొలను పశువైద్యశాలను గురువారం ఆయన పరిశీలించారు. తాడేపల్లిగూడెం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ దివ్యశ్రీ ఉన్నారు.

## ఐటీ అప్లికేషన్స్‌పై అవగాహన ఉండాలి

భీమవరం, జనవరి 4 : సాధారణ ఎన్నికల్లో భాగంగా ఐటి అప్లికేషన్ పై సంబంధిత, అధికారులు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి సూచించారు. కలెకరేట్‌లో గురువారం సాధారణ ఎన్నికలు -2024 ఐటీ అప్లికేషన్స్‌పై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లపైన శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సి ఉందన్నారు.

## ఈవీఎంలతో ఓటు వేసే విధానం తెలుసుకోవాలి


ములపర్రులో ఈవీఎంల పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనుగొండ, జనవరి 4: ఈవీఎంలు ద్వారా ఓటు వేసే విధానం పై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎస్. గురుమూర్తిరెడ్డి అన్నారు. ములపర్రు పంచాయతీ వద్ద రెవెన్యూ శాఖ, ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈవీఎంల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు వీవీ ప్యాట్‌లపై ప్రతీ ఒక్కరూ సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ఈవీఎంలు విధంగా వినియోగిస్తారు.. ఓటు ఏ విధంగా వేయాలనే అంశంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్ దొర, మండల గణాంక అధికారి ఎస్. దుర్గా సాయి, వీఆర్‌వో ఓంకార్, బీఎల్‌వోలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** ఈవీఎం మిషన్ల ద్వారా సులభంగా ఓటు వేయవచ్చని వీటిపై అవగాహన అవసరమని తహసీల్దార్ వై.రవికుమార్ అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు ఈవిఎం మిషన్, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈవిఎం మిషన్, ఓటు వినియోగంపై విద్యార్థులు అనేక సందేహాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఇంకా ఓటు నమోదుకు ఈనెల 5 వరకు సమయం ఉందని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించి ఓటు ప్రక్రియపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామ రాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రామయ్య, వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

ఆచంట, జనవరి 4: ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే మండల పరిషత్ నిధులను ఎంపీటీసీ సభ్యులు వినియోగించుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ సూర్య కుమారి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందించాలని ఎంపీటీసీ సభ్యుడు బొక్కా సుబ్రహ్మణ్యం కోరారు. రైతులకు అధిక దిగుబడి ఇచ్చే పీఆర్ 1206 రకాన్ని అనుమతులు ఇవ్వాలని జడ్పీటీసీ సురేష్‌బాబు కోరారు. వల్లూరు పీహెచ్‌సీలో లేబ్ టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీవో నరసింహ వర ప్రసాద్, వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## బాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్


భవిష్యత్‌కు గ్యారెంటీ బాండ్లు అందిస్తున్న రామరాజు

మొగల్తూరు, జనవరి 4: తెలుగు దేశం అధినేత చంద్రబాబుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. గురువారం ముత్యాలపల్లిలో ఇంటింటా తిరిగి భవిష్యత్‌కు బాబు గ్యారంటీ బాండ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడ్డారని మరో 100 రోజుల్లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశంను గెలిపిస్తే అందరికి మంచి జరిగి రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయన వెంట దొంగ శ్రీను, నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, వాతాడి ఉమామహేశ్వరరావు, కొల్లాటి పెంటయ్య తదితరులున్నారు.

## శ్రీవారి హుండీల ఆదాయం రూ.20.67 లక్షలు



కాళ్ళ, జనవరి 4 : కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి హుండీల ద్వారా రూ.20,67,118 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈవోలు డి.కృష్ణంరాజు, వి.వెంకటేశ్వరరావు, మాజీ ధర్మకర్తలు, భక్తులు సమక్షంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 97 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. జ్ఞానానంద హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతలు పంపిణీ


కోలమూరులో అయోధ్య రామయ్య కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఉండి, జనవరి 4: అయోధ్య రామయ్య అక్షింతలను శ్రీసంతాన వేణు గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో పంపిణీ చేశారు. కోలమూరు గ్రామంలో శ్రీస్వామి వారిని పల్లకిలో ఊరేగింపు జరిపారు. గ్రామంలో ఊరేగింపులో అక్షింతలను భక్తులకు, గ్రామప్రజలకు పంపిణీ చేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి పేరిచర్ల సుభాష్‌రాజు, గోదావరి సంఘవిభాగ్ సంఘచాలక్ అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, ఉండి అసెంబ్లీ బీజేపీ కన్వీనరు కోరా రామ్మూర్తి పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయంలో ఏకాహం

వీరవాసరం, జనవరి 4: ధనుర్మాసం సందర్భంగా రాయకుదురులోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వెంకటేశ్వర భక్తసమాజం అహోరాత్ర ఏకాహం నిర్వహించింది. ఆలయ ప్రాంగణంలో అమలాపురం , కాట్రేనికోన , కొవ్వూరు, పోలమూరు, గ్రామాలకు చెందిన భజన సమాజాలు భక్తి సంకీర్తనలు ఆలపించాయి. ముందుగా గ్రామంలో నగరసంకీర్తన చేశారు.స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అంకరణలు చేశారు. అయోధ్య నుంచి వచ్చిన రాముని పూజ అక్షింతలను కోదండ రామాలయం నుంచి మేళ తాళాలతో ఇంటింటికీ వెళ్ళి, బొట్టు పెట్టి అక్షింతలు పంపిణీ చేశారు.

## సుబ్బయ్యకు సన్మానం

భీమవరం టౌన్, జనవరి 4 :రామమందిర ప్రతిష్ఠలో పాల్గొడానికి దళిత వర్గానికి చెందిన గరికముక్కు సుబ్బయ్యకు అయోధ్య నుంచి ఆహ్వాన పత్రిక, అక్షింతలు వచ్చిన సందర్భంగా గురువారం భీమవరం క్యాంప్ కార్యాలయంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు సన్మానించారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆయుష్మాన్ హెల్త్ కార్డులు అందిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు

పోడూరు, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18రకాల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు కోరారు. కొమ్ముచిక్కాలలో జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పేదలు నాణ్యమైన వైద్యం పొందేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను కేంద్రప్రభుత్వం అందిస్తుందన్నారు. సభలో హెల్త్ కార్డులు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ గుంటూరి రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు బదిరీనారాయణరాజు, ఎంపీడీవో డి.సుహాసిని, ఈవోపీఆర్డీ ఎం.బలరామరాజు, హౌసింగ్ ఏఈ వెంకట్రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ బుజ్జేశ్వరరావు, కార్యదర్శి కడలి శివశంకర్, హెచ్‌పీ డీలర్ పసుమర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం

యలమంచిలి, జనవరి 4: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ యర్రంశెట్టి పద్మారావు అన్నారు. లక్ష్మీపాలెంలో గురువారం వికసిత భారత సంకల్ప యాత్ర సమావేశంలో యర్రంశెట్టి పద్మారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజేపి నాయకులు, వివిధ శాఖల అధికారులు ప్రజలకు వివరించారు.

## కోర్టు ప్రాంగణం పరిశీలన


తాడేపల్లిగూడెంలో కోర్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జడ్జి సీహెచ్.పురుషోత్తం కుమార్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 4: తాడేపల్లిగూడెంలో కోర్టు ప్రాంగణాన్ని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి సీహెచ్.పురుషోత్తం కుమార్ గురువారం పరిశీలించారు. అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు సంబంధించి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రకాష్ బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. సూర్యకిరణ్‌శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి ఉన్నారు.

## కోమలికి ఎమ్మెల్యే అభినందన



పాలకొల్లు టౌన్, జనవరి 4: ఐఆర్ఎంఎస్ ర్యాంకర్ కోమలి జైన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. పాల కొల్లుకు చెందిన కోమలి జైన్ ఐఆర్ఎంఎస్‌కు ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 40మందిలో కోమలి జైన్ ఒకరు. ఈసందర్భంగా గురువారం ఎమ్మెల్యే రామానాయుడు కోమలి జైన్ ఇంటికి వెళ్లి శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.


తణుకులో పనిముట్లతో మునిసిపల్ కార్మికుల నిరసన.. తాడేపల్లిగూడెంలో ఆందోళన.. నరసాపురంలో కార్మికులకు టీడీపీ నాయకుడు కొవ్వలి నాయుడు సంఘీభావం

# కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె

భీమవరం టౌన్, జనవరి 4: మునిసిపల్ కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించకపోగా కార్మికులను రెచ్చగొట్టే విధంగా పోటీగా కార్మికులను పనులకు తీసుకురావడాన్ని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. మునిసిపల్ కార్మికుల సమ్మె మునిసిపల్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కూలీల ద్వారా పారిశుధ్య చర్యలు చేపట్టడం తగదన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**తణుకు:** చాలిచాలని జీతాలతో బతుకుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందని యూనియన్ గౌరవా . ధ్యక్షుడు కామన మునిస్వామి అన్నారు. కార్మికుల పదో రోజు సమ్మెలో భాగంగా గురువారం పనిముట్లు చేతబట్టి నిరసన తెలిపారు. నీలపు ఆదినారాయణ. గుర్రాల చిన్ని, రవి, ముత్యాల శివప్రసాదు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం సమ్మె కొనసాగించారు. పోటీ కూలీలతో పనిచేయించడం దారుణమంటూ నిరసించారు. కూలీలకు తమ సమస్యలు వివరించి మద్దతు తెలపాలని కోరగా వెనుతిరిగారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

**నరసాపురం టౌన్:** మరో మూడు నెలలు ఓపిక పట్టండి జగన్ పీడ వదిలిపోతుంది. అప్పుడు మీ సమస్యలన్నింటిని పరిష్కరించే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందని ఆపార్టీ నియోజకవర్గ నాయకులు కొవ్వలి నాయుడు భరోసా ఇచ్చారు. గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న దీక్షా శిబిరాలను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు.